క్లుప్తంగా

ముంచెత్తిన పొగమంచు



డుంబ్రిగుడలో కురుస్తున్న పొగమంచు

డుంబ్రిగుడ: ఇటీవల ఎడతెరిపిన వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా మారింది. మన్యంలో ప్రస్తుతం చలికాలం మొదలుకావడంతో పొగమంచు కమ్ముకుని పర్యాటకులు, గిరిజనులకు మంచు అందాలు స్వాగతం పలికాయి. ఆదివారం విపరీతమైన పొగమంచు కురిసింది. ఉదయం 8 గంటల వరకు సూర్యోదయం కనిపించలేదు. మంచు కురవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు, ప్రయాణాలు ఇబ్బందులు పడ్డారు. వాహనాల లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. ఈ పొగమంచు అందాలు చలికాలంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూపురులకు కట్టిపడేస్తున్నాయి.

150 మందికి వైద్యపరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో రంపచోడవరంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్టు ఆర్‌కె మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరాయుడు, దాసరి ఉమామహేష్, సంపత్‌కుమార్‌లు వైద్య పరీక్షలు, వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వామి లోకమయనందా మహారాజ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులపై అవగాహన కలిగి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ క్యాంపు ఇన్‌చార్జి కానుమోను శ్రీనివాస్, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భూముల కొలతలపై విద్యార్థులకు అవగాహన



భూముల కొలతలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: భూముల కొలతలపై విద్యార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలని దిబ్బిడి జిల్లా పరిషత్ హై స్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్. మూర్తి తెలిపారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు దిబ్బిడిలో వ్యవసాయ భూముల్లోకి తీసుకెళ్లి వాటి కొలతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దిబ్బిడి హైస్కూల్ హెచ్‌ఎం సత్యారావు మాట్లాడుతూ బహు భాషా విధానం,సైన్స్, సోషల్,గణిత క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందిస్తున్నామని తెలిపారు.

అపూర్వ కలయిక



సమావేశమైన పూర్వపు విద్యార్థులు

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల చదువు పూర్తయిన 23 ఏళ్ల తరువాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నాడు చదువు చెప్పిన గురువులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు స్వర్ణలత, తులసి, పద్మజ, కృష్ణకుమారి, కులయ్యతో పాటు పూర్వపు విద్యార్థులు కోలా మహేష్, ప్రవీణ్, ఎర్రినాయుడు, కండిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి గుడికి విరాళం

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో సత్తెమ్మతల్లి ఆలయ గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భా గంగా మునగపాకకు చెందిన మళ్ల శివ ఆదివారం తన వంతు సాయంగా ఆలయ అభివృద్ధికి రూ.10,116 ప్రకటించారు. మొదటి విడ తగా రూ.5116 కమిటీ సభ్యులకు అందించారు. రామజోగినాయుడు,రాముునాయుడు,జగ్గారావు, వెంకటప్పారావు, ధర్మసూరి పాల్గొన్నారు.

దారులు ఇలా.. ప్రయాణమెలా?



చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో గోతులమయమైన రహదారి



పశువులుబంద రోడ్డు దుస్థితి

- అధ్వానంగా చౌడుపల్లి-జెర్రెల రోడ్డు
- గోతులతో నతమతం
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

చింతపల్లి: మండల కేంద్రానికి కూటవేటు దూరంలో ఉన్న చౌడుపల్లి-పసువులుబంద రోడ్డు అధ్వానంగా మారింది.

చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల పరిధిలో గల 5 పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగించడానికి ఈ మార్గమే ప్రధాన రహదారి. చౌడుపల్లి పంచాయతీ కేంద్రం నుంచి జెర్రెల, వంచుల, మొండిగెడ్డ, కుడుముసారి, బలపం పంచాయతీలకు చెందిన వంద గ్రామాలకు పైగా గిరిజనులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 15 సంవత్సరాలుగా మారని రోడ్డు దుస్థితి నెలకొంది.



చిత్తడిగా మారిన బొర్రంపేట-భరతనపల్లి రోడ్డు

గోతుల దారే గతే

చింతపల్లి మండల కేంద్రం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్నటు వంటి చౌడుపల్లి పంచాయతీ కేంద్రం నుంచి పసువులుబంద గ్రామం మీదుగా జెర్రెల వెళ్తున్న రోడ్డు పూర్తిగా రాళ్లు తేలిపోయి, గోతులమయమై పాడైంది. సుమారు 15 ఏళ్లుగా ఈ అధ్వాన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌడుపల్లి పంచాయతీ పరిధిలో గల ఈదులుబయలు, చినకొత్తూరు, కొత్తవీధి, చెరువూరు, సామరవీధి, పసువులుబందకాలనీ, గురుగూడెంతో పాటు అనేక గ్రామాలు ప్రజలు రాకపోకలు సాగించడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతాల్లో ఏ ఒక్కరికీ అనారోగ్యం పాలైనా ఈ గోతులమయమైన రోడ్డు మీదుగానే ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది.

ఫీట్లు...పాట్లు

చింతపల్లి నుంచి చౌడుపల్లి మీదుగా జెర్రెల-మొండిగెడ్డకు రోజూ నర్సీపట్నం డిపోకు చెందిన బస్ సర్వీసు రాకపోకలు సాగించేది. దీంతో చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలకు ప్రయాణానికి ఎంతో అనుకూలంగా ఉండేది. చౌడుపల్లి నుంచి జెర్రెల ఘాట్ వరకూ రహదారి పూర్తిగా ఛిద్రంగా తయారైంది. అంతేకాకుండా ఘాట్‌రోడ్డు కొంత మేర మరింత దారుణంగా ఉండడంతో బస్సు రాకపోకలు సాగించడానికి వీలులేకుండా పోయింది. దీంతో ఈ ప్రాంతం మీదుగా బస్సు సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఈ ప్రాంత పరిసర ప్రజలకు రాకపోకలు సాగించడానికి కష్టాలు ప్రారంభమై కాలినడకే శరణ్యమైంది. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగేందుకు వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతం. గోతుల్లో పడి ఫీట్లతో ప్రయాణం చేస్తూ పడుతూలేస్తూ అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రూట్‌లో బస్ సర్వీసును తిప్పకుండా రింతాడ, ముల్లుమెట్ట, కడుగులు, వంచులు మీదుగా జెర్రెల-మెండిగెడ్డ సర్వీసును నడిపిస్తున్నారు. దీంతో చింతపల్లి నుంచ చౌడుపల్లి మీదుగా అడ్డుగా 10 కిలో మీటర్లులో జెర్రెలు చేరుకోవాల్సినది ఉండగా, 25 కిలో మీటర్లు చుట్టూ తిరిగిరావడంతో సమయంతో పాటు టిక్కెట్‌కు అదనంగా ఖర్చు అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రయాణం నరకయాతన

కొయ్యూరు: కొయ్యూరు మండలం బొర్రంపేట-రాజవొమ్మంగి మండలం భరతనపల్లి రహదారి అధ్వానంగా తయారైంది.దాదాపుగా ఆరు కిలోమీటర్ల రహదారి పూర్తిగా పాడైంది. ఇది మట్టి రోడ్డు కావడంతో వర్షాలు కురిస్తే గోతుల్లోకి నీరు చేరుతుంది. రహదారి చిత్తడిగా మారడంతో వాహనచోదకులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. రాజవొమ్మంగి నుంచి బొర్రంపేట రాకపోకలకు ఈ మార్గం ద్వారా ప్రయాణం తక్కువ సమయం పడుతుంది.దీంతో ఎక్కువ మంది వాహనచోదకులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. మీ దారిలో వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు

ప్రమాదభరితంగా లోతుగెడ్డ వంతెన



ప్రమాదభరితంగా మారిన లోతుగెడ్డ వంతెన

చింతపల్లి: మండలంలో లోతుగెడ్డ పంచాయతీ కేంద్రానికి సమీపంలో ఉన్న వంతెన ప్రమాదభరితంగా మారింది. దశాబ్దాలు క్రితం నిర్మించినటువంటి ఈ వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు వంతెనకు ఇరువైపులా కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. ఈ వంతెన మీదుగా అల్లూరి జిల్లా పాడేరు కేంద్రానికి చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండల కేంద్రాలతో పాటు రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని అనేక మండలాలు ప్రజలు బస్సులు, జీపులు, కారులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతోపాటు అనేక ప్రత్యామ్నాయ వాహనాల ద్వారా ప్రతి రోజు ఈ వంతెన మీదుగానే వందలాది మంది రాకపోకలు సాగిస్తూఉంటారు.అంతే కాకుండా మండల పరిదిలో ఉన్నటువంటి అనేక గ్రామాలు ప్రజలు సాధారణంగానే ప్రయాణిస్తుంటారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనకు ఇరవైపులా కోతకు గురి కావడంతో వంతెన ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఈ వంతెన మీద నుంచి ప్రయాణం సాగించడానికి వాహనచోదకులు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త శివాజీ

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి, విశ్రాంత శాస్త్రవేత్త శివాజీ కోరారు. స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను, ఆచారాలను అమలు చేయాలన్నారు. హిందూ మతాన్ని రక్షించడం కోసం ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించారన్నారు. 60 వేల సంఘాలు ప్రపంచంలో ఉన్నాయన్నారు. తొలుత ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పిల్లలు ప్రదర్శించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం ఐనాల అప్పారావు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మళ్ల కాలేశ్వరరావు, భాస్కరరావు, వాసు, వేగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ నిమజ్జనోత్సవం



గిరిజన నృత్యాలు



మోతుగూడెంలో అమ్మవారి ఊరేగింపు



మోతుగూడెంలోని ఊరేగింపులో శక్తివేషాలు



ముంచంగిపుట్టులోని ఊరేగింపులో భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక దుర్గమ్మ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ తల్లి విగ్రహాన్ని బాజా భజంత్రీలతో, థింసా నృత్యాలు, టపాసుల మోత నడుమ ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సుజనకోట మత్స్యగెడ్డ ఒడ్డున విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.ఎటువంటి సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహించారు.

మోతుగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మోతుగూడెం దుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. గిరిజన నృత్యాలతో ఊరేగింపు వైభవంగా జరిగింది.

ఘనంగా శూలాల మహోత్సవం



భారీ శూలం ధరించిన భక్తుడు



తరలివచ్చిన భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో దుర్గాదేవి శూలాల మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి మాలలు ధరించిన పలువురు భక్తులు శూలాలు ధరించి అగ్నిగుండం తొక్కారు. శూలాలతో భక్తులు గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. శూలాలతోపాటు అగ్నిగుండం తొక్కే కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. జై దుర్గా నామస్మరణతో వాడ్రాపల్లి మార్మోగింది. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- ఘాట్‌రోడ్డులో కానరాని జంగిల్ క్లియరెన్స్
- రాకపోకలకు వాహనచోదకులు అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదంగా మారిన పిచ్చితుప్పలు



లంబసింగి ఘాట్‌రోడ్డులో అడ్డంగా పడి ఉన్న వెదురుచెట్లు

చింతపల్లి: లంబసింగి ఘాట్‌రోడ్డులో ప్రయాణం వాహనచోదకులకు ప్రమాదకరంగా మారింది. నర్సీపట్నం నుంచి చింతపల్లికి ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూంటారు.ఈ ఘాట్ రోడ్డు మీదుగా నర్సీపట్నం, విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి తుని, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. నర్సీపట్నం మైదాన ప్రాంతం డౌనూరు నుంచి లంబసింగికి 14 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు ద్వారా ప్రయాణం సాగించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈ ఘాట్ రోడ్డులో ఇరువైపులా పిచ్చి తుప్పలు పెరగడంతో పాటు అనేక చోట్ల ఏపుగా పెరిగిన వెదురు చెట్లు రోడ్డుకి అడ్డంగా పడిపోతుండడంతో వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పెరిగిపోయిన పిచ్చితుప్పల వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఘాట్‌రోడ్డులో ఉన్నటువంటి సుమారు 15 ప్రమాదకర మలుపులు వద్ద పిచ్చి తుంపలు పెరిగి పోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఘాట్‌రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం



అప్పలరాజుపేట మట్టి రోడ్డును ముంచెత్తిన వర్షపునీరు



రాజవొమ్మంగి వద్ద పొంగి ప్రవహిస్తున్న కొండవాగు

- ఉరుములు, మెరుపులతో వాన
- పొంగి ప్రవహిస్తున్న వాగులు



రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వానకు జనజీవనం స్తంభించింది. మేతకు వెళ్ళిన పశువులు వాటి వెంట వున్న పశువుల కాపరులు తడిసిముద్దై ఇంటికి చేరుకొన్నారు. భారీ వర్షానికి రాజవొమ్మంగి శివారున గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరి ప్రమాద స్థాయిలో పొంగి ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. అప్పలరాజుపేట వెళ్లే రహదారిపై నీరు చేరి రహదారి చెరువును తలపించింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తికాక వాహనచోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంనితో రాజవొమ్మంగి నుంచి 9 కిలోమీటర్ల దూరంలోని అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి తదితర గ్రామాలకు ప్రయాణం ముందుకు సాగక వాహనచోదకులు నానా ఇబ్బంది పడ్డారు. వట్టిగెడ్డ పొర్లుమదుము ద్వారా వరద నీరు దిగువకు ప్రవహిస్తువుండటంతో రాజవొమ్మంగి శివారు జయలక్ష్మి ఫంక్షన్ హాలు సమీపంలోని గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. పొంగి ప్రవహిస్తున్న ఈ కొండవాగు కారణంగా వయ్యేడు, ముర్లవానిపాలెం, బూరుగపల్లి, ఎర్రంపాడు తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాగుదాటే వీలులేక రైతాంగం అటు ఇటు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. నెల్లిమెట్ల కాలనీ, నెల్లిమెట్ల మధ్య ప్రధాన రహదారికి వాలుగా గల కల్వర్టుపై చిన్నేరు ప్రమాదస్థాయిలో పొంగి ప్రవహిస్తోంది. దాదాపు పది గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.

సీపీఎం నేతల గృహ నిర్బంధాలపై నిరసన



కొత్తపట్నం తీరంలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం కొత్తపట్నం తీరంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపడుతున్న దీక్షలకు మద్దతు పలుకుతున్నారనే నెపంతో పోలీసులు సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్. శంకర్‌రావు, మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాన్ని విషతుల్యం చేసే బల్క్‌డ్రగ్ పార్కును నిలిపివేయాలన్నారు. దీనికి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చేతనైతే ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్బంధాలను ఆపకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణరావు, రామకృష్ణ, ధోని కాసియా, వై.రాము, సి.అప్పలరాజు, రమణ, శివాజీ, వరలక్ష్మి, మంగతాయారు, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నిజాయితీ

పెందుర్తి: మండలంలోనివేపగుంట ప్రాంతాని కి చెందిన బొంతుకూరి వెంకటసత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాల తో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. నగదు బ్యాగ్ అందించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

తెలుగు కథల పోటీలు

యలమంచిలి రూరల్: తెలుగు భాషా పరిరక్షణ సమితి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా స్థాయి తెలుగు కథల పోటీలు నిర్వహించనున్నట్టు సమితి సమన్వయకర్త కొయిలాడ రామ్మోహన్‌రావు తెలిపారు.ఏదైనా అంశంపై 600 నుంచి 1000 పదాలకు మించకుండా కథ ఉండాలన్నారు. ఒకరు ఒక కథనే పంపాల్సి ఉంటుందని, పోటీదారులు పంపించే కథ వారి సొంతమేనని,దేనికీ అనువాదం, అనుసరణం కాదని,ఇదివరకు ప్రచురితం కాలేదని ,అంతర్జాల మాధ్యమాల్లో పెట్టలేదని, ఏ పత్రిక పరిశీలనలో లేదని హామీపత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.13 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ యువకులెవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.2,000, ద్వితీయ బహుమతి రూ.1,500, తృతీయ బహుమతిగా రూ.1,000తో పాటు ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున ఐదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు.విజేతలకు ఈ నెల 24 నుంచి నవంబరు 2వ తేదీ వరకు అనకాపల్లిలో జరగనున్న పుస్తక మహోత్సవంలో బహుమతులు అందజేస్తారు.కథను అక్టోబరు 20వ తేదీ లోపు 'కేఆర్ మోహన్ 230 ఎట్‌దిరేట్ జిమెయిల్.కామ్' మెయిల్‌కు గానీ,వాట్సాప్ నంబరు 9849345060కు గానీ పంపవచ్చు. వివరాలకు 9704811444,9182873598, 9493641584 మొబైల్ ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.